

# కెంపు

బలివాడ కాంతారావు

**అరతులం** బంగారం ఉంగరంలో పొదగబడిన పెద్ద చింత పిక్కంత ఈ కెంపు కెంతో చరిత్ర ఉంది. సరస్వతీ కటాక్షంతో లక్ష్మీదేవికి దూరమైన మా తాతయ్య ఒక కావ్యాన్ని ఆ సీమ పేరే జమీందారుకు అంకిత మిచ్చి మెప్పు పొందాడట. పదెకరాల మాగాణితో పాటు, ఈ కెంపు ఇచ్చి హాయిగా బతక మన్నాడట. మా తాతయ్యకు నలుగురూ కొడుకులే. వాళ్ళ దృష్టి అదృష్టాన్ని తెచ్చి పెట్టిన ఆ కెంపుమీదే ఉండేదట. ఒకసారి చలి జ్వరంతో మంచం పట్టిన తాతయ్య దగ్గరగా చిన్న కొడుకు చేరి "కెంపు నా కిచ్చే మంటే" ముద్దుగా పెంచినా మొగమాటం లేకుండా అడిగాడని కామోసు—

"ఈ కెంపు నా వ్రేలినించి తీస్తే మీ అమ్మ నా మాట వినదురా" అని అరిచాడట.

అలాంటి తాతయ్య ఒక రోజు ఉదయం నలుగురు కొడుకులనూ పిలిచి పట్టిన గొంతుకతో—

"మీ కళ్ళన్నీ నా కెంపు మీదే ఉన్నయ్. ఈ వేళ నా వేలినించి కెంపు జారిపోయింది. ఇది అశుభం" అన్నాడట. కొడుకులు ఒకరి నొకరు అనుమా నిస్తుంటే తలగడ కింద నున్న ఉంగరం తీసి "ఇది నా విద్యకు మెచ్చి తొడిగిన కిరీటం" అంటూ రెండో కొడుకు మా నాన్నను దగ్గరగా పిలిచి వేలికి తొడిగించాడట.

పెద్ద కొడుకు ఉస్సు మని "మేం ఏం తీసి పోయాం?" అంటే మిగతా ఇద్దరూ కోపంతో తాతయ్యను తిట్టి, కొట్టినంత పని చేశారట.

"మారీడికి ఎందు కిచ్చానని పంతాంపి అడుగుతున్నారా? ఎందు కిచ్చానో మీరే తెలుసుకుంటారురా. ఆగండి. తొందర పడకండి" అన్నాడట.

తాతయ్య కొద్ది రోజుల్లోనే పోయాడట. పోయే వరకూ మా నాన్న తప్పించి మిగతా ముగ్గురూ దగ్గరకే చేరలేదు. తాతయ్య పోయే ముందు ఆ కెంపును తాకి మా నాన్న చెవిలో ఒక రహస్యం చెప్పాడట.

మా నాన్న ఆ పల్లెలోనే ఉండి పోయారు. నేను పట్నంలో చదువుకుని మహా నగరాల్లో ఉద్యోగాలు వెలిగిస్తున్నాను. నా పరీక్షల సమయంలో వచ్చి ఒకసారి ఆ కెంపును నా వేలికి తగిలించి "పరీక్షలో జయం తప్పదు" అనేవారు. ఉద్యోగరీత్యా తిరుగుతున్నప్పుడు "నువ్వు ప్రబల మెత్తుతావు. మన ఇంట్లో కెంపు ఉంది" అని రాసేవారు.



నూతన యవ్వనం పొందండి!

మీ జీవితములో పోగొట్టుకున్న యవ్వనమును, నరముల బలమును తిరిగి పొందుటకు ఇతర చికిత్సలవలన ప్రయోజనము పొందక విసుగు చెందినవారు సంపూర్ణ సుఖము పొందుచున్నారు!

భారత ఆయుర్వేద వైద్యములో నిపుణత పొందిన

కవిరాజ్

డా॥ డి. హనుమంతరావు

మహాంకాళివీధి, సికింద్రాబాదు. (GOVT. REGD)

సలహా ఫీజు 10॥రూ. * మందుల ఛార్జీలు ప్రత్యేకం.

సంప్రదించు వేళలు:

ఉదయం 8 నుండి 12 వరకు పగలు 3 నుండి 7 వరకు.

ఆదివారం: ఉదయం 8 నుండి 12 వరకు.

ప్రతి నెల 4, 5 తేదీలల్లో విశాఖపట్నంలో

హోటల్ [illegible] డాబాగార్డెన్స్‌లో క్యాంపు కలదు.



'మా మతమే సక్రమమైనది' అంటూ వివిధ మత అనుచరులు వాదిస్తారు. కానీ మత పురోగమన పద్ధతిప్రకారం, బహాయిలమైన మేము చెప్తాము 'అన్ని మతాలు సక్రమమైనవే'

నవనందనం

పుస్తకమును చదవండి!

140 పేజీలు వెల: రు. 9 (తపాలాఖర్చులుమినహా)

పుస్తకం కొరకు ఈ క్రింది చిరునామాకు వ్రాయండి...

బహాయి సమాచార కేంద్రము

9-1-97, తాతాచారి కాంపౌండ్,

సికిందరాబాద్-500 025

లేదా—

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్

రాష్ట్రపతిరోడ్, సికిందరాబాద్-500 003

chandra


ఈ గుడ్డి నమ్మకాలకు అతీతుడిగా ఉన్నా, నాలో ఒకోసారి కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరికేవి కావు. గ్రామాధికారిగా మా నాన్న తెచ్చుకున్న జీతం కన్నా పాతిక రెట్లు జీతం తెచ్చుకుంటున్న నేను ఎప్పుడూ నెలాఖరుసరికీ ఎందుకు డబ్బుకు వెతుకుంటున్నాను? సర్కారు ఉద్యోగిగా నేను రూపొందించిన ప్రణాళికలకు ప్రాణం వచ్చినా నాకు తృప్తి ఎందుకు లేదు? నేనులవున్నది, రాజకీయ కారణాల వల్ల కాదని అన్యాయంగా పోతున్న నా పెద్ద మీద నేనెందుకు తిరగబడలేక పోతున్నాను?

పల్లెలో మా నాన్న ఏలుబడిని, దయా దాక్షిణ్యాలను, మనో విభ్రాన్ని, మమకారాలను తెంచుకుని పలికే సత్యాలను చూస్తున్నప్పుడు అది ఆ కెంపు మహిమే అనిపించి నా వేలికీ కొన్నాళ్ళు పెట్టుకోనివ్వండని అడుగుదా మనుకున్నాను. అంతలో ఎవరో అన్నారు—"ఆ కెంపుతో తమరు పొద్దులా వెలిగి పోతున్నారు."

"ఈ కెంపు ఈ ఇంట్లో ఉండబట్టే ఈ మారుమూల పల్లె నించి నా కొడుకు ఢిల్లీ సింహాసనం మీద కూర్చుని ఏలుతున్నాడు. నా చేత నున్నా వాడికి ఏ ఆపదా రాకుండా రక్షిస్తోంది."

ఆ చివరి మాటలు విన్నాక అతను అడక్కుండగా దానిపై ఆశ పెట్టుకో కూడదని నిర్ధారించుకున్నాను. తరవాత కొన్నాళ్ళు పోయాక ఢిల్లీ తీసుకు వచ్చాను. ఇంటో ఆయనకు నప్పక వేగంగా వెళ్ళి పోతానన్నారు. వెళ్ళి పోయే ముందు అన్నారు—

"ఈ కెంపు నీ దగ్గరుంటే నువ్వు నవరు వెలాయిస్తావు. నవరు పల్లె టూర్లో వెలాయిస్తే ఫరవాలేదు కానీ, ఇక్కడ బంట్రోతు మంత్రిలా మసలు తున్నాడే." కాసేపు ఆగి—

"ఇక్కడుంటే ఈ కెంపుకు కాలుష్యం అంటుకుంటుంది" అన్నారు.

"మన పూర్వులా పెంట కుప్పలా, పందులదొడ్లూ ఈ అందమైన పట్నంలో లేవే" అన్నారు.

"ఎక్కడ విష్క్రల్మష హృదయాలు హెచ్చు ఉంటే అక్కడే కాలుష్యం ఉండదు" అన్నారు.

నాన్నగారు వెళ్ళిపోయాక కొన్నాళ్ళకు అతని ఆరోగ్యం బాగు లేదని తెలిసి డాక్టరుకు ఒకసారి చూపించండని రాశాను. వెంటనే జవాబు వచ్చింది.

"ఇంత కాలం నా ఆరోగ్యం ఒక మహా భాగ్యమని గర్వపడ్డాను. ఆ గర్వం పోగొట్టుకోవటం ఇష్టం లేదు. త్వరలో సైకిలు మీద మళ్ళీ తిరుగుతానులే" అని రాశారు.

స్కూలు, కాలేజీ, విశ్వవిద్యాలయంలో చదివి ఎన్నో విషయాలు తెలుసుకున్న తరం వాడి. ప్రపంచంలో ఏ మూల మూల ఏ మేధస్సు వెలుగు ప్రసరించినా కిటికీ గుండా చూసి ఉత్తేజ పడే దృష్టి నాది. ఇంత తెలుసుకున్నా, మా నాన్న కున్న మనో నిబ్బరం, శరీరంపై ఆయ నున్న అధికారం, ఆలోచన, వివేకం నాకు లేవు. ఈ కెంపు అతను అందుకున్న ఘన తరతరాల విజ్ఞానానికి చిహ్నమా? నా వూహాల అంతరిక్ష నౌకకు ఇంధనం ఇచ్చే రాకెట్‌లా ఈ కెంపు అపురూపమైన శక్తిని సృష్టించేదేమో? కనపడని దేవుని అభయ హస్తంలా అదృష్టం ఈ కెంపులో దాగుందేమో?

తన దాయాదులు ఎన్ని పన్నాగాలు పన్నినా తన నేమీ చెయ్యలేక పోవడానికీ, తన ఆరోగ్యం క్షీణించకపోవడానికీ, సైకిల్ మీద నించి పడినా ఎక్కడా దెబ్బ తగలక పోవడానికీ, ఏటిలో కొట్టుకు పోయినా ఒక తువ్వ సహాయంతో ఒడ్డు చేరడానికీ కారణం ఈ కెంపేనని ఇంకా మా నాన్న దాటి చెప్పుతూనే ఉంటారు.

ఆ మధ్య నేను పెంపులో పనుప్త్రోవలో పెద్ద పట్నంలో, మా చెల్లెలు ఇంట్లో శుభకార్యం జరుగుతుంటే దిగాను. ఆ వేళ ఎండలో మా నాన్న బస్సు మీద వచ్చారు. మనిషి కాస్త నీగారించి నట్లు కనిపించారు. కదిలేటప్పుడు కొద్దిగా ఆయాసం పడటం, ఎడమ కాలి ముడుకు పట్టు పడటం చూసి, "పదండి. డాక్టరు దగ్గరకు వెళదాం" అన్నాను.

"సైకిలు తొక్కడం మానేశానురా. అందుకు మానగానే ఆయాసం పెరిం చేసింది" అన్నారు.

"ఏందుకేనా మంచిది. ఒకసారి బ్లడ్ ప్రెజరు తనిఖీ చేయిద్దాం" అన్నాను.

"ఇప్పుడా? మూడు పాతికలు దాటి పోయాయి కదా!"

"ఇప్పుడే అవసరం."

"ఈ వయసులో మందులు సరిగా పని చెయ్యవు. చేస్తే బతుకుతాను కానీ జీవచ్ఛవంగా ఉండాలని లేదు."

"అలా అంటే ఎలా?"

"మందులు తిని మూడేళ్ళు బతికే బదులు, అన్నం తింటూ ఈ వేళ పోతేనే అదృష్టం" అని గొణిగారు.

ఆ వేలికి పట్టి ఉన్న కెంపు ఉంగరాన్ని అతను చూసుకుంటుంటే సమస్యలతో సంశయాలతో నిత్య రోగిలా మారిన నేను, సర్వ రోగ నివారిణి లాంటి ఆ కెంపుమీద చిన్న మమకారపు దృష్టి

ప్రసరించగానే అతను నవ్వుకుని—

"మా నాన్నగారు ఉంగరం తగిలిస్తూ ఏమన్నాడో తెలుసా? అతని మాటల్లో ఎంత నిజం ఉందో?"

"ఇన్నాళ్ళు దాచిన ఆ రహస్యం చెప్పండి" అన్నాను.

"నా కరుణ రస కావ్యం జమీందారు గుండెకు హత్తుకో బట్టే కదా ఈ కెంపు నా కిరీట మయ్యింది! ప్రజల గుండెల్ని దోచుకున్న వారే ఏ ఉన్నతి నైనా సాధించగలరు."

ఈ రహస్యం చెప్పి వూరుకోలేదు. ఈ హృదయాలను దోచుకోవడానికి అత నేమేమి చేశారో సాయంత్రం వరకు అదేపనిగా చెబుతూనే ఉన్నారు. విజ్ఞానం నిండిన అతని మాటలు ప్రవాహంలా తోసుకు వస్తుంటే అంపశయ్య మీద పడుకుని అంటున్నారని చీకటి పడితే గానీ తోచింది కాదు. అలా మాటాడుతూ బాత్‌రూమ్‌కి వెళతానని లేచారు. ఎంత సేపటికీ రాకపోతే నాకే అనుమానం వచ్చి "నాన్నా" అని కేక వేశాను. జవాబు లేదు. చప్పున తలుపు బాదాను. గట్టిగా పట్టి తలుపు తోశాను. బిగువుగా నున్న తలుపులో గడియ వెయ్యలేక పోయారు. తలుపు తెరవగానే ఏమైందీ తెలుసుకోవడానికి ఒక క్షణం పట్టలేదు. ఆ వీధిలోనే ఉన్న డాక్టరును పిలిస్తే ఒక ఇంజక్షను ఇచ్చి పెద్ద ఆసుపత్రికి తీసుక వెళ్ళమన్నాడు. అంబులెన్స్‌లో పడుకోబెట్టేసరికి నాన్న కాళ్ళు చల్లబడి పోతున్నయ్. నోరు తెరిచి ఉన్నా మాట పడిపోయింది. కేజువాల్టీ వార్డులో వెంటనే చేర్చి పరీక్ష చేశారు. సుత్తితో కొట్టినా కాళ్ళలో సంచలనం లేదు. ఆక్సిజన్ పెట్టారు. నన్ను తప్పించి మా వాళ్ళ నెవరినీ లోనికి రానీయులేదు. మెదడులో రక్తనాళాలు పగిలిపోయాయి. హెమరేజి వచ్చేసింది.

అతని వేపు చూస్తూ అసలు కెంపులా మెరుస్తున్నారని గర్వ పడుతుంటే డాక్టరు నన్ను పిలిచి బతికే అవకాశం లేదని చెప్పాడు. నాన్న దగ్గరగా వెళ్ళి ఒకసారి ఆయన శరీరం తాకాను. స్పృహ లేదు. ఒళ్ళు బాగా పొంగిపోయి ఉంది. అలా చూస్తూండగానే ఒక్క వెక్కు వెక్కి ప్రాణం వదిలారు. చప్పున నా కళ్ళలో నీళ్ళుబికి పోయాయి. అతని మీద తల ఆన్చి దుఃఖాన్ని ప్రయత్నించినా ఆపుకోలేక గట్టిగా ఏడ్చేశాను. నర్సు నన్ను పక్కకు తీసి అతని మీద దుప్పటి కప్పింది. గబగబ బయటకు వచ్చేశాను. అర్ధరాత్రి దాటి అప్పుడే మూడు గంటలయ్యింది. బయటకు రాగానే మా నాన్న కోర్కె గుర్తుకు వచ్చింది. "ఏ వూర్లో పుట్టానో, ఆ వూర్లోనే బుగ్గయితేనే గౌరవం" అనే వారు. అద్దె కారు బేరమాడాను. శుభకార్యం తల పెట్టిన చెల్లెలు ఇంటికి శవం తీసుకు వెళ్ళటం ఇష్టం లేదు. కారు బేరమాడి వార్డులోకి వెళుతుంటే అప్పుడే శవం స్ట్రెచ్చర్ మీద బయటకు వచ్చేసింది. బయట చీకటిగా ఉంది. శవం వార్డునించి మోసిన సిబ్బంది పాతిక రూపాయలు లంచం ఇస్తే పేచీ పెట్టారు. వాళ్ళు కోరినది వాళ్ళ ముఖాన పారేసి తెల్లవారేసరికి మా గ్రామం చేరుకున్నాం. ఇంత కాలం ఏ గడపలో కూర్చుని తీర్పులు చెప్పేవారో, భారత భాగవత రామాయణ గాథలు రమ్యంగా వినిపించేవారో, ఆ గడప మీదే అతని భౌతిక కాయాన్ని వేయించాను. అలా వేస్తుండగానే చూశాను—అతని వేలిలో ఉంగరం లేదు. శరీరం ఒక్కసారి జరజర కంపర మెత్తినట్లయింది. కత్తిరించి కాజేశారు. ఎవరు? ఎక్కడ? ఎందుకు? ఈ ప్రశ్నలకు సమాధానం వెంటనే దొరికాయి. ఏ కక్కుర్తి మనిషో ఆ కొద్ది నిమిషాల వ్యవధిలో ఆ వార్డులో అంత పనీ చేసేశాడు. ఆ కెంపు వాడి కొక హుమ్మాలు పాడి. గాజు పెంకు. వాడికి కావలసినది ఆ బంగారం. ఈ రోజుల్లో దాని విలువ వెయ్యి రూపాయలు. డబ్బు విలువ తప్పించి ఇంకో విలువలు తెలియని అంధు డెవడో చేసిన పని ఇది. ఇలా ఎన్నెన్నో అనుకుని అంత్యక్రియలు జరిపించినా, మనసు గాయ పడ్డ మనసులావే ఉంది. ఆ కెంపు తెచ్చే అదృష్టం, అదృష్టవంతుడు చేసే తిరుగులేని ఏలుబడి, ఆ రాజయోగంతో వచ్చే ఖ్యాతి, ఆ ఖ్యాతిలో కలిగే ఆనందం, తృప్తి...ఇలా పెట్టుకున్న నా ఆశలన్నీ భగ్న మండిపోయినయ్.

ఇలా మథన పడుతున్న మనసులో చప్పున ఒక వూహ తిరిగింది. ఈ వూహ రావటానికి కారణం మా తాతయ్య చెప్పిన రహస్యం గుర్తుకు రావటం. నా చేతిలోనూ ఒక ఉంగరం ఉంది. ఈ ఉంగరం అర తులం ఎత్తుదే. పదేళ్ళ క్రితం మా నాన్నే చేయించి ఇచ్చారు. కెంపు బదులు కందిగింజంత మంచి ముత్యం పొదిగించారు. ఎందు కలా చేశారు?

మా తాతయ్య ఆ కెంపు పొదిగిన ఉంగరాన్ని నలుగురు కొడుకుల్లో అర్హతగలవాని వేలికే తొడిగాడు. మా నాన్నకు ఒక్క కొడుకునైనా ఆ ఉంగరం నాకు దక్కలేదు. ఎవరికి తగినది వాళ్ళకు దక్కుతుంది. ఆ కెంపు ఎవడో అర్హత కలవానికే దక్కుతుందని తృప్తి పడ్డాను. ●


ఓం శ్రీ మాత్రే నమః



## నవశక్తివారి నుండి భక్తులకు అతి ముఖ్యమైన సందేశం

జగద్గురు శ్రీ కంచి కామకోటి శ్రీ జయేంద్ర సరస్వతి, శ్రీ శృంగేరి శారదా పీఠ మహాసన్నిధానం, కొండల్ శ్రీ ఆచార్య శ్రీ శరణతీర్థ మహారాజా మరియు పెక్కుమంది ఇతర ప్రముఖ యోగుల కృపతోను, ఆశీస్సులతోను పవిత్ర వస్తువులు ఉత్పత్తిచేయు ప్రముఖ సంస్థ.

1. శ్రీ మహామేరు (పంచలోహ) 1¼"×1¼" రూ. 300.00
2. శ్రీ చక్రం మరియు ఇతర చక్రాలు 8 సె. మీ × 8 సె.మీ. ఒక్కొక్కటి రూ. 115.00
3. శ్రీ మహాలక్ష్మీయంత్రం 16సె.మీ. × 16 సె. మీ. రూ. 500.00
4. వెండి పూతగల స్టాండుతో బంగారుపూజా తాయెత్తు
   1. శ్రీ అష్టలక్ష్మి ఒక్కొక్కటి దాదాపుగా 5.8 సె. మీ. రూ. 75.00
   2. శ్రీ అంబాజీ 5.8 సె.మీ. దాదాపుగా ఒక్కొక్కటి రూ. 75.00
   3. శ్రీ బద్రివార్ దాదాపుగా 5.8 సె.మీ. ఒక్కొక్కటి రూ. 75.00
5. దృష్టి నివర్తి యంత్రం (ప్రేముతో) రూ. 50.00
   దృష్టి నివర్తి డాలర్ రూ. 50.00
   (దిష్టికళ్ళు పడకుండా, ప్రమాదాల నివారణకు, ఇంటిపై, పనిచేయు స్థలంపై, వాణిజ్య స్థలంపై చెడుప్రభావం ఉండకుండా)
6. వివాహ ప్రాప్తి డాలర్ (త్వరలో వివాహమునకు) రూ. 50.00
7. అసలైన రుద్రాక్షమాల (వెండి అల్లికతో) 54 రూ. 250.00
8. అసలైన స్ఫటిక మాల 54 రూ. 250.00
9. సుదర్శన డాలర్ రూ. 50.00
10. సుదర్శన యంత్రం (చిత్తరువు) రూ. 50.00
11. అసలైన తామరమాల, వెండి అల్లిక, 54 పూసలతో రూ. 100.00
12. ఎలక్ట్రానిక్ రాగి చేతి కడియం (గాజు) పన్నెండు రాసులకు ఒక్కొక్క రాశికి రూ. 20.00

దయచేసి మీ ఆర్డర్‌తోబాటు 50 శాతం అడ్వాన్స్‌గా చెల్లించుడు. వస్తువులు వి.పి.పి. ద్వారా పంపబడును.

ఈ క్రింది చిరునామా వద్ద సంప్రదించుడు:

విశ్వకర్మశ్రీ, శ్రీ విద్యా ఉపాసక స్వామిజీ

**ఎస్. టి. మురుగభూషణం**

(రాష్ట్రపతికి సలహాదారు)

నవశక్తి నిలయం, 153, లాయడ్స్ రోడ్డు,
గోపాలపురం, మద్రాసు—600 086.
ఫోన్ : 812013.

(గమనిక : ఉత్తర ప్రత్యుత్తరములు ఇంగ్లీషులో మాత్రమే)